కాలనీ కనుమరుగు

- పోలవరం కాలువ నిర్మాణానికి ఇళ్ల తొలగింపు
- చెల్లాచెదురైన కుమ్మరిలోవ కాలనీ నిర్వాసితులు
- వేర్వేరు ప్రాంతాలకు తరలిపోయిన వైనం
- రోడ్డున పడిన 472 కుటుంబాలు



పోలవరం కాలువ పనుల్లో భాగంగా కనుమరుగవుతున్న కుమ్మరిలోవ కాలనీ

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి అనువుగా కుమ్మరిలోవ కాలనీలో ఇళ్ల తొలగించడంతో నిర్వాసితులు చెల్లాచెదురయ్యారు. నిర్వాసితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వకుండా పరిహారం, ఇళ్లస్థలాలు ఇచ్చిన ప్రభుత్వం కాలువ పనులకు ఆటంకం లేకుండా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని ఆదేశించింది. ఈ మేరకు కొంతమంది గ్రామంలో అందుబాటులో ఉన్న అద్దె ఇళ్లకు వెళ్లారు. అద్దె ఇళ్లు లభించని ఆయా కుటుంబాలు సమీపంలోని తుని, పాయకరావుపేట పట్టణాలకు వెళ్లిపోవాల్సి వచ్చింది. నాలుగు దశాబ్దాలుగా కలసిమెలసి ఉన్న 472 కుటుంబాల వారు చెల్లాచెదురుగా వెళ్లిపోయాయి. అక్కడే పొడిపంటలు ఉన్న వందలాది మంది నిర్వాసితులు స్వయంగా ఇళ్లు నిర్మించుకునే పనిలో నిముగ్నమయ్యారు. రూ.లక్షలు విలువ చేసే ఇళ్లను కోల్పోయినప్పటికీ అధైర్యపడకుండా నిర్వాసితులే ప్రభుత్వం ఇచ్చిన అరకొర పరిహారంతో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. మరోపక్క నిర్వాసితులు రెండు నెలల నుంచి ఇళ్లు ఖాళీ చేస్తుండడంతో కాలువ తవ్వగా వచ్చిన మట్టి, రాళ్లను కాంట్రాక్ట్ సిబ్బంది కాలనీ ఇళ్ల మధ్య వేస్తున్నారు. దీంతో దశాబ్దాల చరిత్ర ఉన్న కుమ్మరిలోవ కాలనీ కాలగర్భంలో కలసిపోయి కనుమరుగవుతోంది.

అరకొర వసతులతో..

కుమ్మరిలోవ కాలనీ నిర్వాసితులకు సమీప దుద్ధికలోవలో ఇళ్లస్థలాలు కేటాయించారు. ఇళ్ల నిర్మాణానికి అనువుగా తాత్కాలిక విద్యుత్ లైను, నీటి వసతి కల్పించారు. రోడ్లు, కాలువలు, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వంటి భవనాలు నిర్మిస్తే నిర్వాసిత కాలనీ రూపురేఖలు మారుతాయని నిర్వాసితులు పేర్కొన్నారు. ఉన్నత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

1984లో పెంకిటిళ్ల నిర్మాణం

కుమ్మరిలోవ గ్రామానికి చెందిన పేదలకు, పక్కా గృహాలు లేని కుటుంబాలకు 1984లో అప్పటి ప్రభుత్వం పెంకిటిళ్లను కట్టించి ఇచ్చింది. కుమ్మరిలోవ, తుని పట్టణానికి మధ్యగా ఉండడంతో కాలనీలో ఇళ్లు లభించిన ఆయా కుటుంబాలు ఉదయమే పొలం పనులు చేసుకుని ఆ తర్వాత ఇతర పనులకు తుని పట్టణానికి వెళ్లేవారు. మొదట్లో 360 ఇళ్లు ఇచ్చినప్పటికీ క్రమంగా ఆ సంఖ్య 472కి చేరింది. తర్వాత ఆర్థిక పరిస్థితులు మెరుగుపడడంతో కొంతమంది పెంకిటిళ్లను తొలగించి శ్లాబ్ ఇళ్లు నిర్మించుకుని జీవించారు. 2012లో పోలవరం ఎడమ ప్రధాన కాలువ కుమ్మరిలోవ కాలనీ మీదుగా వెళ్తుండడంతో ఎస్‌డీసీ అధికారులు భూసేకరణ చేపట్టారు. బాధితుల జాబితాలో అక్రమాలు, ఇళ్లస్థలాలు కేటాయింపులో పారదర్శకత లోపించడంపై నిర్వాసితుల ఆందోళనలతో కాలయాపన జరిగింది.



కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న నిర్వాసితులు

2018–19లో కొంతమందికి ఆర్‌ఆర్ ప్యాకెజీ చెల్లించినప్పటికీ అధికశాతం మందికి ప్యాకెజీ అందకపోవడం, జరిగిన అక్రమాలపై కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో ఇళ్లు ఖాళీ చేయలేని పరిస్థితి, అలాగే పాడుబడ్డ ఇళ్లల్లో బిక్కుబిక్కుమంటూ నిర్వాసితులంతా జీవనం సాగించారు. ఇటీవల నిర్వాసితులందరికీ ప్యాకెజీలు ఇవ్వడంతో పాటు మూడు సెంట్ల నుంచి ఐదు సెంట్లకు పెంచి రెండు ప్రాంతాల్లో ఇళ్లస్థలాలను ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చింది. ప్యాకేజీతో పాటు భూసేరణ సమయంలో లెక్కల ప్రకారం ఇళ్ల నిర్మాణానికి రూ.2.85 లక్షలు చొప్పున చెల్లించడంతో ఇప్పుడు సొంతంగా ఇళ్లను నిర్మించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన ప్యాకేజీ కంటే అధికంగా ఇళ్ల నిర్మాణానికి ఖర్చవుతుందని నిర్వహితులు ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పులు చేయలేక అద్దె ఇంట్లోకి..

30 ఏళ్లగా ఉన్న ఇల్లు పోలవరం కాలువలో పోయింది. అందరితో పాటే మేమూ ఇళ్లు ఖాళీ చేశాం. ప్రభుత్వం ఇచ్చిన ఐదు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు పరిహారం డబ్బు సరిపోవడం లేదు. అప్పులు చేయలేక తునిలో అద్దె ఇల్లు తీసుకుని కుటుంబంతో సహా వెళ్లిపోయాము.

– ఎం.గోవిందురావు, నిర్వాసితుడు

మౌలిక వసతులు కల్పించాలి

నిర్వాసితులకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలి. ఇళ్ల స్థలాలు, ఇల్లు నిర్మాణానికి రూ.2.85 లక్షలు చొప్పున ఇచ్చారు. ఆ మొత్తం పునాదులకే సరిపోవడం లేదు. పొడిపంట ఉన్న నిర్వాసితులు తప్పని పరిస్థితుల్లో స్వయంగా ఇళ్ల నిర్మించుకుంటున్నారు. రోడ్లు కాలువల వంటి మౌలిక వసతులు కల్పించాలి.

– జక్కాన రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు

క్లుప్తంగా

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి దివీస్ ఫార్మా కంపెనీలో రాగి మెటల్ చోరీ కేసులో ముగ్గురు బీహార్‌వాసులను అరెస్టు చేసినట్టు తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ప్రకారం ఈ నెల 6న దివీస్ కంపెనీలో రాగి మెటల్ చోరీకి గురైంది. దీనిపై యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై దర్యాప్తు చేపట్టారు. కంపెనీలో పనిచేస్తున్న బీహారీలు బిట్టుకుమార్, అభిషేక్ కుమార్, దీపక్ కుమార్ కలిసి 1700 కిలోల రాగి మెటల్‌ను దొంగిలించి విక్రయించారు. దీనికి సంబంధించిన నగదు రూ.6.50 లక్షలు రికవరీ చేసినట్టు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడిగా వెంకటేష్



తుని: వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడిగా మండలంలోని డి.పోలవరం గ్రామానికి చెందిన గంగవరపు వెంకటేష్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. వెంకటేష్‌కు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

కిర్లంపూడి: విధి నిర్వహణలో కష్టపడి పనిచేసే ఉద్యోగులకు ప్రతి చోటా అపూర్వ గౌరవం దక్కుతుందని సర్పంచ్ అల్లు విజయ్‌కుమార్ అన్నారు. గోనేడ సచివాలయాల్లో పనిచేసి వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన సిబ్బందిని గురువారం సర్పంచ్ విజయకుమార్, ఎంపీటీసీ అల్లు శివరామ కృష్ణ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ప్రజలకు వారు అందించిన సేవలను కొనియాడారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రౌతులపూడి: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. రౌతులపూడి–కత్తిపూడి రహదారిలో గురువారం ఆయన సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. పలు వాహనాలను ఆపి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా లేకపోయినా, నిబంధనలు అతిక్రమించినా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వాహనానికి రికార్డులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కత్తిపూడి రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ప్రత్తిపాడు రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు (సీఆర్‌ఎంటీ) కోరారు. ఈ మేరకు గురువారం ఏపీసీఆర్పీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలుపే రాంజీప్రసాద్ ఆధ్వర్యంలో అన్నవరంలో రాష్ట్ర సమగ్ర శిక్ష డైరెక్టర్ బి.శ్రీనివాసరావును కలసి వినతి పత్రాన్ని అంజేశారు. ఈ సందర్భంగా రాంజీప్రసాద్ మాట్లాడుతూ గత 14 ఏళ్లుగా సీఆర్‌ఎంటీగా విధులు నిర్వహిస్తున్న తమకు నేటికీ ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. గత ఐదేళ్లుగా తమ వేతనాలు కూడా పెంచలేదన్నారు. సీఆర్‌ఎంటీలను ఎ, బి క్లస్టర్లుగా విభజించడం వల్ల బి క్లస్టర్‌కు చెందిన వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే సీఆర్‌ఎంటీల వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీఆర్పీడబ్ల్యూఏ నేతలు కోళ్ల యరకయ్యనాయుడు, బాల గణేష్, రాజబాబు, మద్ది నాగశివ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర శివారు భూములకు సాగునీరు

జగ్గంపేట: మండలంలోని పుష్కర ఎత్తిపోతల పథకం శివారు భూములకు సాగునీరు అందించేందుకు రూ.3 కోట్లతో కొత్త పథకం ఏర్పాటు చేస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేటలోని క్యాంప్ ఆఫీసులో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలోని ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం, గొల్లలగుంట, మర్రిపాక ప్రాంతాల్లో భూములకు పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు సక్రమంగా అందడం లేదని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా మామిడాడలోని కొత్త చెరువులోకి గోదావరి జలాలు మళ్లించి, అక్కడ నుంచి మిగిలిన చెరువులకు సాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ఏలేశ్వరంలో భారీ వర్షం

ఏలేశ్వరం: మండలవ్యాప్తంగా గురువారం ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, తిరుమాలి తదితర గ్రామాల్లో వర్షం పడింది. ఉదయం నుంచి ఎండతీవ్రతతో పాటు ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీవర్షం పడింది. సుమారు గంట పాటు పడిన వర్షానికి రహదారులు, పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ల మధ్య, రహదారులపై వర్షపునీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం



ఎస్.అన్నవరంలో దాడిశెట్టి రాజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఈశ్వరరావు, తదితరులు

తుని రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేస్తానని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెలగా ఈశ్వరరావు అన్నారు. ఎస్.అన్నవరంలోని తన కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజాను కలసి కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం, పార్టీ బలోపేతానికి కృషి చేస్తాన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: ఆటో, మోటార్ క్యాబ్, ట్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయానికి ఈ నెల 17 నుంచి 19 వరకూ కొత్త దరఖాస్తులు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించనున్నట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 22న క్షేత్రస్థాయిలో పరిశీలించి, తుది జాబితాను 24న ప్రకటిస్తామన్నారు. అర్హులకు అక్టోబర్ 1న రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తున్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బురదకోట గిరిజన గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యశస్వి

ప్రత్తిపాడు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.యశస్వీ సూచించారు. మండలంలోని పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బురదకోట, కె.మిర్తివాడ, ధారపల్లి గిరిజన గ్రామాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 51 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యశస్వీ మాట్లాడుతూ బురదకోటలో 27, కె.మిర్తివాడలో 16, ధారపల్లిలో ఎనిమిది మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ రామిశెట్టి రాంబాబు, ఎస్‌యూఓ ఎన్‌వీ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు జువ్వల రాజా, డి.రాజబాబు, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తొలుత గ్రామంలో రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన కొండలరావు



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన కొండలరావు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభంను రాజమహేంద్రవరం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో కలిసి ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ముద్రగడ అనేక అభివృద్ధి పనులు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తన తండ్రి మాదిరిగానే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట మారిశెట్టి సత్యనారాయణ, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ పడాల శ్రీను తదితరులు ఉన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

ప్రత్తిపాడు: రాజమహేంద్రవరంలోని మంజీర కన్వెన్షన్ హాలులో గురువారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి తదితరులు ఎంపీ మిథున్‌రెడ్డిని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీ మిథున్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాధితురాలికి ఆర్థిక సాయం



అన్నవరంలో బాధితురాలి కుమారికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీ కృష్ణంరాజు

అన్నవరం: గ్రామానికి చెందిన గంపల కుమారి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. కాగా వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం ఆమెను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె పూర్తిగా కొలుకునేవరకూ తన వంతు సాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, గ్రామ ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్న, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, పలివెల కొండలరావు, గంపల జయరాజు, పెద్దింటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన గుమ్మిడి నూకరాజు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని గురువారం మురళీకృష్ణంరాజు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత నూకరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి తోటల యాజమాన్యంపై శిక్షణ

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో రైతులకు మామిడి, జీడిమామిడి తోటల సమగ్ర యాజమాన్యం, తేనెటీగల పెంపకంపై గురువారం శిక్షణ ఇచ్చారు. డివిజన్ ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతులకు కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం అధికారి ఎన్‌వీ రఘునందన్, ప్రగతి శీల తేనెటీగల పెంపకందారుడు రామరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మామిడి, జీడిమామిడి సాగులో తెగుళ్ల నివారణ, నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రఘునందన్ వివరించారు. తేనెటీగల పెంపకంపై రామరాజు అవగాహన కల్పించారు. రాజపూడి గ్రామ సర్పంచి బూసాల విష్ణుమూర్తి, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.



సూక్ష్మ సేద్యం పరికరాల వినియోగాన్ని వివరిస్తున్న జిల్లా అధికారి వరప్రసాద్

సూక్ష్మ సేద్యంపై వీఏఏ, వీహెచ్‌ఏలకు శిక్షణ

తుని రూరల్: సమగ్ర అవగాహనతో రైతులకు సూక్ష్మ సేద్యంపై చైతన్యం తీసుకురావాలని కాకినాడ జిల్లా అధికారి జీవీవీ వరప్రసాద్ అన్నారు. మండలంలోని తేటగుంటలో ఉద్యాన అధికారి కె.సుజాత అధ్యక్షతన గురువారం ఉద్యానశాఖ అమలు చేస్తున్న పథకాలపై వీఏఏ, వీహెచ్‌ఏలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సూక్ష్మ సేద్యం అధికారి వరప్రసాద్ మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యం పరికరాలు, రిజిస్ట్రేషన్లు, ఎరువులు వినియోగంపై సమగ్రంగా వివరించారు. ఎరువులను సూక్ష్మ సేద్యం ద్వారా పంటకు ఏవిధంగా పూర్తిస్థాయిలో అందించాలో డెమో నిర్వహించారు. ఆర్‌కేవీవై, ఎంఐడీహెచ్, కొబ్బరి డెవలప్‌మెంట్ బోర్డు, నేషనల్ ఇడిబుల్ ఆయిల్, ఆయిల్‌పామ్, నేషనల్ బాంబూ మిషన్, ఏపీఎంఐపీ, పీహెచ్‌ఎం, ఈపంట తదితర పథకాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

జగ్గంపేట: గోకవరంలో బాలికపై అత్యాచారం కేసులో మరో ముగ్గురు నిందితులు ఉన్నారని, వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. కూటమి ప్రభుత్వంలో మహిళలు, యువతులపై జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో రైతు కూలీ సంఘం నేతలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ గోకవరంలో దళిత కుటుంబానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి అత్యాచారం చేయడం దారుణమన్నారు. ఈ ఘటనలో మరో ముగ్గురు నిందితులు ఉండగా పోలీసులు వారిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు కేసును పక్కదోవ పట్టిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు సోమరాజు, శివ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పీ4 కుటుంబానికి నిత్యావసరాల అందజేత

తుని రూరల్: తుని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎన్.శ్రీధర్ ఎస్.అన్నవరంలో దత్తత తీసుకున్న పీ4 కుటుంబానికి సైకిల్, నెలవారీ నిత్యావసరాలు అందజేశారు. గురువారం ఎస్.అన్నవరంలో నివాసం ఉంటున్న కీర్తి చంద్రమ్మ ఇంటికి స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎమ్మెల్యే సూచనల మేరకు చంద్రమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్టు తెలిపారు. ఎంపీడీఓ కె.సాయినవీన్, స్వర్ణాంధ్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఉల్లాస్ ఉపాధ్యాయులకు శిక్షణ

రౌతులపూడి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉల్లాస్ ఉపాధ్యాయులకు గురువారం ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో 190 మందిని మూడు బృందాలుగా విభజించి శిక్షణ ఇచ్చారు. జిల్లా ఉల్లాస్ అక్షరాంధ్ర పథకం ఉప సంచాలకులు పసుపులేటి పోశయ్య మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది నిరక్షరాస్యులుగా ఉన్నారన్నారు. ప్రతిఒక్కరూ డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆ దిశగా ఉల్లాస్ ఉపాధ్యాయులు నిరక్షరాస్యులకు డిజిటల్ అక్షరాస్యతపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి, ఎంఈఓ–1 సతీష్‌బాబు, వెలుగు ఏపీఎం త్రినాథమ్మ, సీసీలు నాగమణి, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



ఉల్లాస్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అక్షరాంధ్ర జిల్లా ఉపసంచాలకులు పోశయ్య

చిరుధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సీతారామ శర్మ

ప్రత్తిపాడు: మండలంలోని టి.రాయవరంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఎ.సీతారామశర్మ మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకత, విలువ జోడింపు, ప్రయోజనాలను వివరించారు. పెద్దాపురం వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ రాగులు, జొన్నలు, సజ్జలు, అరికలు, సామలు తదితర చిరుధాన్యాల సాగులో మెళకువలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయ సబ్సిడీలు, డ్రోన్ వినియోగం, నానో యూరియా, నానో డీఏపీపై జగ్గంపేట ఏడీఏ గరిమెళ్ల శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి జోకా అమృత, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద



ప్రత్తిపాడులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద మాట్లాడుతున్న సీఐ అంకబాబు తదితరులు

ప్రత్తిపాడు: ప్రపంచానికే ఆదర్శం స్వామి వివేకానంద అని పెద్దాపురం క్రైం సీఐ రాజులపాటి అంకబాబు అన్నారు. స్థానిక నరేంద్రగిరిపై ప్రపంచంలోనే ఎత్తయిన స్వామి వివేకానంద విగ్రహం వద్ద గురువారం నరేంద్రగిరి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. 1893 సెప్టెంబర్ 11న స్వామి వివేకానంద అమెరికాలోని చికాగో నగరంలో ప్రపంచ మతాల సభలో ప్రసంగించారని పరిషత్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ అంకబాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద చికాగో ప్రసంగం వల్ల భారత దేశ గొప్పతనం, సనాతన ధర్మాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేశారన్నారు. చికాగో ఇన్స్టిట్యూట్ ముందు ఉన్న మార్గానికి గౌరవార్థం స్వామి వివేకానంద మార్గం అని నామకరణం చేశారన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టీస్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, నరేంద్రగిరి కమిటీ సభ్యులు రేపాక ప్రసాద్, రాయుడు రాము, నందిపాటి సిద్ధార్థ పాల్గొన్నారు.

వీఓఏ చేతివాటం

డ్వాక్రా గ్రూపు సొమ్ము స్వాహా

గండేపల్లి: వీఓఏ చేతివాటం ప్రదర్శించి డ్వాక్రా గ్రూపు సభ్యుల సొమ్మును స్వాహా చేసిందని బాధిత మహిళలు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కె.గోపాలపురానికి చెందిన లక్ష్మీదుర్గ డ్వాక్రా గ్రూపు సభ్యులు పాతాళ దేవి, గోపాల కృష్ణవేణి, ఈశ్వరమ్మ, నాగమణి, పినపాల దేవి, వీరలక్ష్మి, జనపరెడ్డి అప్పలరాజు మహిళా సమాఖ్య ద్వారా బ్యాంక్ నుంచి 2023లో లోన్ తీసుకున్నారు. తాము తీసుకున్న లోన్ సొమ్ము తమ వద్ద గ్రామ వీఓఏ బుదిరెడ్డి సాయి వసూల్ చేసి బ్యాంక్‌కు చెల్లించేవారని తెలిపారు. సొమ్ము మొత్తం చెల్లించాక కొత్త లోన్ తీసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లగా మీ బాకీ పూర్తి కాలేదని ఇంకా రూ.24,000 కట్టాల్సి ఉందని అధికారులు చెప్పడంతో డ్వాక్రా గ్రూప్ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై వీఓఏ సాయి నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధిత మహిళలు ఏపీఎం సన్యాసిరావును ఆశ్రయించారు. దీనిపై ఏపీఎంను వివరణ కోరగా విచారణ జరిపి వీఓఏ నుంచి సొమ్ము రికవరీ చేసి గ్రూపు సభ్యులకు న్యాయం చేస్తామని తెలిపారు.



గండేపల్లిలో ఏపీఎంను ప్రశ్నిస్తున్న డ్వాక్రా మహిళలు

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

కోటవురట్ల: ఓ యువతి ఇష్టం లేని పెళ్లి చేశారని తీవ్ర మనస్తాపం చెందింది. మనసు చంపుకుని భర్తతో కాపురం చేయలేక బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం ఆక్సాహేబుపేటలో గురువారం చోటు చేసుకుంది. జగ్గంపేటకు చెందిన చల్లపల్లి లోవలక్ష్మి(24)కి ఇష్టం లేకపోయినా నాలుగు నెలల క్రితం ఆక్సాహేబుపేటకు చెందిన జోగిరాజుకు ఇచ్చి వివాహం చేశారు. అప్పటి నుంచి కలతగా ఉన్న ఆమె మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో శబ్దం రావడంతో బంధువులు వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కొన ఊపిరితో కనిపించింది. ఆమెను ఉరి నుంచి తప్పించి హుటాహుటిన తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అయితే లోవలక్ష్మి భర్త జోగిరాజు చాలా మంచి వ్యక్తి అని, అర్థం చేసుకోకపోవడం వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గోకవరం: మండలంలోని మల్లవరానికి చెందిన నున్నగొప్పుల అప్పలనాయుడు ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు తోట బాబ్జి, పెంటయ్య, త్రిమూర్తులు, కల్యాణ్, శివ, నరసయ్య, పార్టీ జగ్గంపేట పట్టణ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక లింగంపర్తి రోడ్డులోని శ్రీనివాసనగర్, మండలంలోని రమణయ్యపేటలో అన్నదానాలు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిర్లంపూడి: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా వీరవరంలోని వినాయక ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తోట బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.



వీరవరంలో స్వామివారిని దర్శించుకుంటున్న శ్రీరాంజీ